# జాతకం

"నమస్కారం, శాస్త్రిగారూ! బహుకాల దర్శనం?"

పెళ్ళిళ్ళ సీజనగదా! క్షణం తీరిక లేదంటే నమ్మండి. ఏదో నా శాయశక్తులా లోకసేవ చేస్తున్నాను."

"మీ లోక సేవ" గూర్చి మాకు తెలిందీ ఏముంది గానీ మా అమ్మాయి సంగతేమైనా ఆలోచించారా లేదా?" – అసలు పాయింటుకు వచ్చారు చూడామణిగారు.

"అందుకే గదా పనిగట్టుకు వచ్చింది. లింగం కృష్ణహరిగారని ఉన్నారు. వారి అబ్బాయి జాతకం మీ అమ్మాయి జాతకం భేషుగ్గా కలిసాయి. మీరు 'ఊ' అంటే పెళ్ళిచూపులు ఏర్పాటు చేస్తాను."

"అబ్బాయేం చదివాడు? ఏం చేస్తున్నాడు?"

"బి.యస్సీ. చదివి గత మూడేళ్ళనుండి మాక్సో కంపెనీలో మెడికల్ రిప్రెజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. నెలకు ఆరువేలు జీతం. అలవెన్సులు అదనం."

"సొంత ఫ్లాటేనా?"

"కాదు. కృష్ణహరిగారు వారి కంపెనీ ఫ్లాటులో ఉంటున్నారు. పెద్ద ఫ్లాటు కాబట్టి అబ్బాయి పెళ్ళి తర్వాత కూడా ఏమి ఇబ్బంది ఉండదు. మరో రెండేళ్ళ తర్వాత అబ్బాయికి కంపెనీ ఫ్లాటు వస్తుంది."

అబ్బాయి తరుపు వారి మరికొన్ని వివరాలు కనుక్కున్నాక, "సరే, పెళ్ళిచూపులు ఏర్పాటు చేయండి" అన్నారు చూడామణిగారు.

శ్రీపాద – మంజూషల పెళ్ళిచూపులు జరిగాయి. పెద్దల శల్యపరీక్ష కాక శ్రీపాద నుండి కూడా కొన్ని జటిల ప్రశ్నలు ఎదుర్కొంది మంజూష. ఆ తర్వాతే అబ్బాయి తరపు నుండి గ్రీన్ సిగ్నల్. బి.కామ్. చదివిన మంజూష సమ్మతం అంత అవసరమనుకోలేదు చూడామణిగారు. తల్లి మాత్రం కూతురు నడిగింది. మంజూష మౌనం వహించింది. అబ్బాయి పరవాలేదనిపించినా, అతని ఉద్యోగం అంతగా నచ్చలేదు. ఎప్పుడూ క్యాంపులు ఉండే ఉద్యోగం! అక్కడ వారి ఉద్యోగ బాధ్యతలు కాక ఏ ఏ నిర్వాకాలు చేస్తారో చాలా కథల్లో చదివింది. అందుకే కాస్త జంకింది. కాని మౌనం పూర్ణ అంగీకారంగా తీసుకుని సంబంధం చేసుకోవడానికి నిర్ణయించారు పెద్దలు.

అబ్బాయింటికి వెళ్లారు అమ్మాయి తరుపు బృందం. తరచి చూస్తే దూరపు బంధుత్వం కలిసింది. ఒకే కులం వాళ్ళలో అది మామూలే. ఇచ్చి పుచ్చుకోవడాలు మాట్లాడుకున్నారు. పెట్టుపోతలు కాక, ఆనవాయితీ ప్రకారం పెళ్ళిఖర్చు అమ్మాయి తరపువారే భరించాలి. రిసెప్షను తనతో కాదన్నారు చూడామణి.

"అలా అంటే ఎలా? పెళ్ళి ఖర్చంతా మీరే భరించాలి. రిసెప్షను కూడా పెళ్ళిలో భాగమే కదా!" అందుకున్నారు కృష్ణహరి.

"ఇప్పటికి మీరన్న వాటికంతా ఒప్పుకున్నాను. అదే తడిసి మోపెడయేట్టుంది. నిజానికి మాకు రిసెప్షన్ అవసరం అంతగా లేదు. మా వాళ్ళంతా పెళ్ళికే వస్తారు. అలాంటప్పుడు ఇంకా నా భారం పెంచకండి" – అమ్మాయి తండ్రి ప్రాధేయపడ్డాడు.

అబ్బాయి శ్రీపాద అందుకున్నాడు.

"సరేలెండి రిసెప్షను ఖర్చులు మేము సగం భరిస్తాం."

శ్రీపాద ఈ మాటల్లో తల దూర్చటం కృష్ణహరిగారికి నచ్చలేదు. అయినా మిన్నకున్నారు.

శ్రీపాద, మంజూషల పెళ్ళి వైభవంగా జరిగింది. అనుకున్న దానికంటే ఎక్కువే అయింది ఖర్చు. అయినా చూడామణిగారు బాధపడలేదు. తగ్గిన గుండె మీది భారంతో పోలిస్తే అప్పు భారం అంత బరువనిపించలేదు.

పాంచ్‌గనీ, మహాబలేశ్వర్‌లో ఓ వారం శృంగార యాత్ర చేసి వచ్చారు కొత్త దంపతులు. కంపెనీలో పైరవీ చేసి, స్థానిక డ్యూటీ వేసుకున్నాడు. కనీసం ఆరునెలలు క్యాంపు వద్దనుకున్నాడు. కొత్త బిచ్చగాడు పొద్దెరుగడు అని వేళాకోళం చేశారు సహోద్యోగులు. ఆరునెలలు ఆరు క్షణాల్లా గడిచిపోయాయి. మళ్ళీ క్యాంపులు మొదలయ్యాయి. కాకపోతే ఏ క్యాంపూ నాలుగు రోజులకు మించడంలేదు. గుడ్డిలో మెల్ల అని సరిపెట్టుకుంది మంజూష. సెలవు రోజుల్లో సినిమాలకనీ, షికార్లకనీ క్రమం తప్పకుండా వెళుతున్నారు. బంధువుల, స్నేహితుల ఇళ్ళకు కూడా రాకపోకలు సాగుతున్నాయి. కాపురం సజావుగా సాగుతోంది.

ఓ రోజు.....

శ్రీపాదను సహోద్యోగి సహాయంతో ఇల్లు చేర్చవలసి వచ్చింది. ఒళ్ళు పేలిపోతోంది. మనిషి తూలుతున్నాడు. ప్యాంటంతా పాడైంది. క్యాంపులో తీవ్ర జ్వరం, అతిసార వ్యాధి సోకడంవల్ల అర్జంటుగా కార్లో ఇంటికి తీసుకువచ్చానని చెప్పాడు కూడా వచ్చినతను.

శ్రీపాదను నర్సింగ్‌హోమ్‌లో చేర్పించారు. సెలైన్ పెట్టారు. ఎక్సెరే, ఉమ్మి, మలమూత్రం, రక్తపరీక్ష మొదలెట్టారు. వారం రోజుల తర్వాత కాస్త కోలుకున్నాడు శ్రీపాద. వ్యాధి పూర్తిగా నయం కాకపోయినా తీవ్రత మాత్రం తగ్గింది. నర్సింగ్‌హోమ్ నుండి డిశ్చార్జ్ చేసారు. మందులు వాడుతూ పథ్యం పాటించమన్నారు. కనీసం నెలరోజులు విశ్రాంతి తీసుకోవాలి.

నెల రోజుల్లో జబ్బు నయమైంది కాని మనిషి పూర్తిగా చిక్కిపోయాడు. పన్నెండు కిలోలకు పైగా బరువు తగ్గాడు. మునుపటి చురుకుదనం లేదు. మాటిమాటికి అలసిపోతున్నాడు. రక్తం వృద్ధి కొరకు వాడిన మందులవల్ల పెద్ద ఉపయోగం కనపడలేదు.

నలభైరోజుల సెలవు తర్వాత డ్యూటీలో చేరాడు శ్రీపాద. అతని ఆరోగ్యం దృష్ట్యా, మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్‌లో డెస్క్ వర్క్ ఇచ్చారు.

మంజూష మనుసు మనసులో లేదు. శ్రీపాద ఆరోగ్యంలో ఏదో పెద్ద మార్పు కొట్టొచ్చినట్టు కనబడుతుంది. పైకి ఆరోగ్యంగా కనబడినా, శ్రీపాద పూర్తిగా కోలుకోలేదని తన అనుమానం. మనసు కీడును శంకిస్తోంది. ఓసారి తల్లి దగ్గరికి వెళ్లి తన బాధనంతా వెళ్ళబోసుకుంది. తండ్రితో చెప్పుకోలేని కొన్ని విషయాలు తల్లితో చెప్పింది. అంతా సవ్యంగా

జరుగుతుందని ఆమె ఓదార్చింది. భగవంతునిపై భారం వేయడం తప్ప తానేమీ చేయజాలనని వాపోయింది.

భార్య ద్వారా విషయం తెలుసుకున్న చూడామణి, కృష్ణహరిగారితో మాట్లాడతానన్నారు. అంతలో శ్రీపాదను మళ్ళీ నర్సింగ్‌హోమ్‌లో చేర్చారు. వ్యాధి మళ్ళీ తిరగబెట్టింది. తీవ్ర జ్వరం, అతిసారం అస్సలు తగ్గడంలేదు. ఈసారి ఇంకా పెద్ద స్పెషలిస్టును సంప్రదించారు. ఆయన కొన్ని స్పెషల్ టెస్టులు సూచించారు. పరీక్షల్లో తేలింది... శ్రీపాద రక్తం హెచ్.ఐ.వి. పాజిటివ్ అని.

మంజూష అనుమానాలు నిజం అయ్యాయి.

పాత రిపోర్టు చూస్తే పెళ్ళికి ముందు సుఖవ్యాధులు ఉన్నట్టు తేలింది. హెచ్.ఐ.వి. రిపోర్టు మాత్రం నెగెటివ్ అని ఉంది. అంటే పెళ్ళికాకముందే కాక పెళ్లయిన తర్వాత కూడా బయటి తిరుగుళ్ళు శ్రీపాదకు అలవాటే అని! మిన్ను విరిగి మీద పడ్డట్లైంది మంజూషకు. కృష్ణహరిగారికి కూడా తల కొట్టేసినట్లైంది. అయినా తమాయించుకున్నాడు. తీరిగ్గా ఆలోచించి, ముందు మంజూష రక్తం హెచ్.ఐ.వి. పరీక్ష చేయించారు. అదృష్టవశాత్తు నెగెటివ్ రిపోర్టు వచ్చింది. చిమ్మచీకటిలో చిరు వెలుగు! అప్పుడే పిల్లలు వద్దని శ్రీపాదచే పాటింపచేసిన కుటుంబ నియంత్రణ పద్ధతి మంజూష పాలిటి వరమైంది.

ఇక కృష్ణహరిగారు ఆలస్యం చేయలేదు. ఎయిడ్స్ రోగితో కాపురం కూడదని ఆయనే మంజూషను పుట్టింటికి తీసుకువెళ్ళారు. మంజూష మనసులో పెనుతుఫాను! పెళ్లై సంవత్సరం తిరక్కుండానే తన వివాహ సౌధం నేలమట్టమైంది. దీంట్లో తను చేసిన నేరమేమిటి? పెళ్ళికి ముందు తను అనుమానం వ్యక్తం చేసినా ఇలా కాకపోవునేమో! అయినా తన మాటకు విలువెక్కడిది? అబ్బాయి నచ్చినదీ లేనిదీ చెప్పకముందే తన సంబంధం ఖాయపర్చినవారు తన అనుమానాన్ని మాత్రం ఖాతరు చేసేవారా? ఏది ఏమైనా తన జీవితం మాత్రం భగ్నం అయింది – అనుకుంటూ కుమిలిపోసాగింది మంజూష.

మంజూష అవస్థ చూసి ఆమె తల్లి గుండె తరుక్కుపోయింది. 'తాము ఎవరికీ, ఎప్పుడు ఏ హానీ తలపెట్టలేదే? ఎందుకీ శిక్ష విధించాడు భగవంతుడు? ప్రారబ్ధం అంటే ఇదేనా? అమ్మాయి ఇంట్లో ఉన్నందుకు ఇరుగుపొరుగువారికి ఏమని చెప్పాలి?' తల్లి బాధ తల్లిది.

చూడామణిగారు కూడా లోలోన మధనపడుతున్నారు. 'జాతకాలు కలిసిన తర్వాతే పెళ్ళి చేశాడే. ఇప్పుడా జాతకాల విలువేమిటి? ఈ కాలంలో జాతకాల కంటే రక్తపరీక్ష ముఖ్యమనిపిస్తోంది. మన సమాజంలో అంత ముందు చూపుందా? ఆరోగ్య పరీక్షలంటే ఇంకో సంబంధం చూసుకుంటామంటారు మగపెళ్లివారు. అహం తప్ప ఆలోచన ఉండడం అరుదు కదా వారిలో, – ఇలా ఆలోచిస్తూ ఉద్యోగానికి కూడా వెళ్లటం మానేశారు.

ఓరోజు ఆయన సహోద్యోగి సీతారాం వచ్చి.....

"ఏమిటిది చూడామణీ, అన్నీ తెలిసిన నీవే ఇలా ధైర్యం కోల్పోతే నీ భార్యా, బిడ్డలను ఓదార్చేదెవరు? అదృష్టవశాత్తు అమ్మాయికారోగం అంటలేదు. అలా అనుకుని సంతోషించు. జరిగినదానికి బాధపడుతూ కూర్చోటంకంటే జరుగబోయేదాని గురించి ఆలోచించడం విజ్ఞుల లక్షణం. కృష్ణహరిగారితో సంప్రదించి మంజూష భవిష్యత్తు గురించి

చర్చించాలి.

గాంధీ పార్కు..... సాయంత్రం ఆరున్నర. ఇంకా చీకటి కాలేదు. పార్కులో కృష్ణహరి, చూడామణిగార్ల ముఖాల్లో మాత్రం చీకట్లు ద్యోతకమౌతున్నాయి. వారితోపాటే కూర్చున్న సీతారాంగారు మాత్రం గంభీరంగా ఉన్నారు. కాసేపాగి.....

"పరిస్థితులు గమనిస్తే, శ్రీపాదకు పెళ్ళికి ముందే బయటి గాలి అలవాటని తెలుస్తూనే వుంది. ఈ విషయం తెలిసీ మీరు అబ్బాయికి పెళ్ళి చేయడం న్యాయమా కృష్ణహరిగారూ!"

"చదువుకుని ఉద్యోగం చేస్తున్న యువకుడు. దానికితోడు క్యాంపులు, సహవాసాలు. చిలక్కొట్టుళ్ళు అలవాటయ్యాయి. నాకు తెలిసేసరికి సమయం మించిపోయింది. వెంటనే చర్య తీసుకున్నాను. నిపుణులైన డాక్టర్లచే వైద్యం చేయించాను. సుఖవ్యాధులు నయమయ్యాక హెచ్.ఐ.వి. పరీక్ష కూడా చేయించాను. అది నెగెటివ్ అని నిర్ధారించుకున్న తర్వాతే పెళ్ళి ప్రయత్నాలు మొదలుపెట్టాను. దీంట్లో నా తప్పేముంది?"

"ఆ విషయం ఎదుటివారినుండి కప్పిపుచ్చడం సమంజసమేనా?"

"వయసులో చెడు తిరుగుళ్ళు తిరిగే వారెందరు లేరు? వారికిక పెళ్ళే చేయకూడదా?"

"అలా అని కాదు. కాని ఈ విషయం ముందే తెలిస్తే తగు జాగ్రత్తలు తీసుకునే వీలుండేది గదా?"

చూడామణిగారు నోరు విప్పారు.

"ఇలాంటి విషయాలు బయటపెడితే ఇక అబ్బాయికి సంబంధం కుదిరేనా? ఎంత విశాల భావాలున్న వారైనా తెలిసి తెలిసి తమ పిల్లల భవిష్యత్తు పాడుచేస్తారా? ఇప్పుడు మాత్రం జరిగిందేమిటి? అబ్బాయి జీవితం సరే, అమ్మాయి జీవితం కూడా బలైంది కదా?

"మా అబ్బాయిది తప్పే ఒప్పుకుంటాను. పెళ్ళి తర్వాత కూడా పాత వాసనలు పోలేదు. అలవాట్లో పొరబాటైంది. దానికి అనుభవిస్తున్నాడు. అనుభవిస్తాడు. ఎయిడ్స్‌కి మందు కనుగొనబడితే తప్ప గత్యంతరంలేదు. ప్రాణాలు అరచేతిలో బెట్టుకుని రోజులు లెక్కబెడుతూ దినదినగండంగా గడపాలి. జరిగినదానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటాను.

"ఏం చేస్తారేమిటి?" సీతారాంగారు ప్రశ్నించారు.

"శ్రీపాద నేరానికి మంజూషకు శిక్ష పడకూడదు. విడాకులు తీసుకుందాం. భరణమే కాక మీ పెట్టుపోతలన్నీ తిరిగి మీకు అప్పజెబుతాం. మేము పెట్టిన నగలు మీ వద్దనే ఉండనీయండి. కొత్త జీవితం ప్రారంభింపజేయండి. ఇకనుండి మంజూష నా కోడలు కాదు. నా కూతురు! తన కాళ్ళమీద తను నిలబడడానికి నా శాయశక్తులా సహకరిస్తాను. కంప్యూటరు కోర్సు లాంటిదేమైనా చేస్తే ఆ ఖర్చంతా భరిస్తాను. ఉద్యోగం కొరకు ప్రయత్నిస్తాను. అంతేకాదు తగిన వరుణ్ణి ఎన్నుకుంటే నా చేతులమీదుగా పెళ్ళి చేస్తాను, ఇదే నా ప్రాయశ్చిత్తం. ఈ విషయాలు దస్తావేజు ద్వారా ధృవీకరిస్తాను. ఇంకా ఏం చేయాలో మీరు సూచించండి" – కృష్ణహరిగారి కళ్ళలో నీళ్ళు.

చూడామణి, సీతారాం అవాక్కయ్యారు. వారు మాత్రం అంతకంటే ఏం ఆశించగలరు?

(రచన మాసపత్రిక నవంబరు1999)